క్లుప్తంగా

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని హుస్సేన్ కట్ట వద్ద గల మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం దేవస్థాన అర్చకులు పాములపాటి చంద్రశేఖర్ ఆచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

25 నాటికి పనులు పూర్తి కావాలి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేట పంప్‌హౌస్‌లో చేపట్టిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్ పనులు ఈనెల 25 నాటికి పూర్తి చేయాలని కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నులకపేట పంప్‌హౌస్‌లో రూ.33 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రెజర్ శాండ్ ఫిల్టర్ బెడ్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణనగర్ పంప్‌హౌస్ నుంచి తాగునీటి సరఫరా అందించే ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదని, 25 నాటికి పనులు పూర్తిచేసి ప్రతి ప్రాంతంలో తాగునీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టామని అన్నారు. పనులను సచివాలయ సిబ్బంది త్వరగా పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయ విద్యార్థులు శుక్రవారం నూతక్కి గ్రామంలో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ ట్రాఫిక్, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, రోడ్డుపై వాహనాలు నడుపుతున్నప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, అతివేగం ప్రమాదకరమని వివరించారు. సాక్ డైరెక్టర్ హాయ్ విజయ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రూతు రమ్య, డాక్టర్ గోపికృష్ణ, శుభకర్ రాజు, సీఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

23న ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 23న ఉగాది పురస్కరించుకుని పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారిణులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులైన అడిషనల్ ఎస్పీ కె. సుప్రజ, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి. విజయ, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సీహెచ్. అమూల్య, బీసీ కార్పొరేషన్ ఈడీ డి. దుర్గాబాయి, సివిల్ సప్లయిస్ జీఎం జి.లక్ష్మి, సీఐడీ ఎస్పీ కె.జి.వి. సరిత, అన్నదాన సమాజం ఈవో డి. ప్రమీలారాణి, కాకి భాగ్యలక్ష్మి, మేకల శేషుకుమారికి పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

చురుగ్గా సామాజిక భవనాల నిర్మాణం

సామాన్యులకు వరం

- శుభకార్యాలు, ఫంక్షన్లు తక్కువ ఖర్చుతో చేసుకునే అవకాశం
- ఇప్పటికే కొన్ని సామాజిక భవనాల నిర్మాణం
- మరి కొన్నింటికి స్థలాల కొరకు అన్వేషణ
- ఎమ్మెల్యే ఆర్కే కృషితో పూర్తి కావస్తున్న భవనాల నిర్మాణం

మంగళగిరి: పేదలు ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే ఇంటి వద్ద తగిన స్థలం ఉండదు... ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్‌లు, కల్యాణ మండపాలు అద్దెలు అందుబాటులో ఉండవు. దీంతో అనేక మంది అవస్థలు పడుతున్నారు. నగరంలో ఏ ఫంక్షన్ హాల్, కల్యాణ మండపాలు, కన్వెన్షన్‌లు చూసినా అద్దె, కరెంట్ బిల్లు, ఖర్చులు వెరశి సుమారు రూ.2 లక్షలు కాక తప్పడం లేదు. సామాన్యులు శుభకార్యాలు సంతోషంగా జరుపుకోలేకపోతున్నారని గమనించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వెంటనే ఆయా సామాజికవర్గ భవనాల నిర్మాణాలు చేపట్టారు. మంగళగిరి తాడేపల్లి నగరంలో ఇప్పటివరకు 10 సామాజికవర్గ భవనాలు(కమ్యూనిటీ హాల్స్) నిర్మాణం చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్ని తుది దశకు చేరుకున్నాయి. మంగళగిరిలో ఎస్సీ సామాజికవర్గాలకు రెండు బాప్టిస్ట్‌పేటలో ఒకటి, నీరుకొండ దళిత శిబిరంలో మరొకటి, రాజీవ్ గృహకల్ప వద్ద పద్మశాలీయులకు, రజక కమ్యూనిటీ హాల్స్, మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద సగరులకు, సీతారామకోవెల వద్ద గౌడ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేస్తుండగా ఇప్పటికే రెండు పూర్తికాగా మిగిలినవి తుది దశకు చేరుకున్నాయి. ఒక్కో కమ్యూనిటీ హాల్‌కు రూ.50 నుంచి రూ.75 లక్షలు వెచ్చిస్తున్నారు. తాడేపల్లిలోను మరో మూడు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం జరుపుకుంటున్నాయి.



నగరంలోని సీతారామకోవెల వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న గౌడ సామాజిక వర్గ భవనం



రాజీవ్ గృహకల్ప వద్ద శరవేగంగా పనులు కొనసాగుతున్న పద్మశాలీయ సామాజిక వర్గ భవనం

మరికొన్ని సామాజికవర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాల కోసం అధికారులు నగరంలో స్థలాలు అన్వేషిస్తున్నారు. గౌడ కమ్యూనిటీ హాల్‌కు సర్దార్ గౌతు లచ్చన్న, డాక్టర్ వైఎస్సార్ పేర్లతోను ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఇలా ఆయా సామాజికవర్గాలలో త్యాగమూర్తుల పేర్లు పెడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలు సంతోషంగా శుభకార్యాలు చేసుకోవాలి



నేటి ఆధునిక యుగంలో ఒక ఫంక్షన్ చేయాలంటే అద్దెలు లక్షలలో చెల్లించాల్సి వస్తుంది. పేదలు ఫంక్షన్ జరుపుకునే పరిస్థితి కనిపించడం లేదు. పేదలు సైతం తమ ఇంట్లో జరిగే శుభకార్యాన్ని సంతోషంగా జరుపుకోవాలనే కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టాం. స్థలాల కొరత కారణంగా మరో రెండు మూడు సామాజికవర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేయలేకపోయాం. త్వరలోనే స్థలాలను గుర్తించి అన్ని సామాజికవర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే

అందరికి అమ్మవారి ఆశీస్సులు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి
- దామరపల్లి పోలేరమ్మ తిరునాళ్లలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

దామరపల్లి(తాడికొండ): అమ్మవారి ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగాలని తాడికొండ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలోని శ్రీపోతురాజు, పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని మరో 30 సంవత్సరాలు వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లిబోయిన శ్రీనివాసరావు, కొల్లికొండ వెంకటేశ్వరరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎల్‌యూకి ఎక్సలెన్స్ అవార్డు



కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ వి.రాజేష్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో ఎక్సలెన్స్ అవార్డు లభించింది. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ మాట్లాడుతూ యునెస్కో, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, పర్యావరణ మంత్రిత్వ శాఖల సమన్వయం, అడ్వాన్స్‌డ్ వాటర్ డ్రైనేజీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ నీటి వినియోగం, నిర్వహణలో కేఎల్ విశ్వవిద్యాలయానికి ఎక్సలెన్స్ అవార్డు లభించిందని తెలిపారు. ఈ అవార్డును విశ్వవిద్యాలయ ప్లానింగ్, అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్ న్యూఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా అందుకున్నారని తెలిపారు. కేఎల్‌యూకి ఇటువంటి గౌరవం లభించడం ఇది రెండవసారి అని అన్నారు. ప్లానింగ్, అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వాడిన నీరు వృథాగా బయటకు పోకుండా శుద్ధి చేసి ఆ నీటిని మొక్కలకు వాడడం ద్వారా భూగర్భ జలాలకు అందజేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కాజలో సీసీ రోడ్ల నిర్మాణం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజలో 14, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.45 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చేపట్టిన రహదారి శుక్రవారం పూర్తికాగా, 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కాజలో చెరువు గట్టు వెంబడి గత 20 ఏళ్లుగా రోడ్డు నిర్మాణం చేయక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే ఆర్కే కాజ పర్యటించిన సమయంలో పుల్లయ్యనగర్ వాసులు రోడ్డు నిర్మించాలని కోరడంతో ఒకేసారి 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.20 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.25 లక్షలు కేటాయించి పుల్లయ్యనగర్‌లో తులసి రమేష్ ఇంటి నుంచి చిన్న లక్ష్మి ఇంటి వరకు 290 మీటర్ల పొడవున 5 మీటర్ల వెడల్పుతో ఈ రహదారి నిర్మాణాన్ని చేస్తున్నట్లు కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.



పుల్లయ్యనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్

యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ప్రతిభ

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రులో ఉన్న యూనివర్సల్ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థిని ఆల్ ఇండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచింది. కాలేజిలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్న షేక్ ఆఫ్రిన్ హైదరాబాదులో ఈ నెల 11,12 తేదీలలో జరిగిన నాల్గవ ఆల్ ఇండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ అంతర కళాశాల క్రీడా పోటీలలో టేబుల్ టెన్నిస్ (సింగిల్స్)వి భాగంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచింది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ మర్రెడ్డి విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ కేశవరెడ్డి, ఎం.జయరామిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆఫ్రిన్‌ను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

తాడేపల్లిరూరల్: ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, ఉద్యోగ, రైతాంగ, వ్యవసాయ కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. దుగ్గిరాలలోని పీహెచ్‌సీ సెంటర్‌లో ఆశా వర్కర్లను కలసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పాలనలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, మందుల ధరలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలపై ఈనెల 21వ తేదీన గుంటూరులో డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ దుగ్గిరాల మండల అధ్యక్షకార్యదర్శులు సీహెచ్ వెంకటేశ్వరమ్మ, తెనాలి సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక ర్యాలీ కరపత్రాలను శుక్రవారం సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి యర్రబాలెంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యిందని విమర్శించారు.

చిలువూరులో ప్రచారం

ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ప్రజాసంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు వి.సాంబశివరావు, కె. సుబ్బారావు, వై.బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటెల్ హైస్కూల్ వార్షికోత్సవం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో ఉన్న ఇంటెల్ హైస్కూల్ 24వ వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా హైకోర్టు రిటైర్డు జడ్జి డాక్టర్ కె.జి.శంకర్ హాజరవుతారని తెలిపారు.

మాజీ మునసబు మార్పుల మృతి

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ మునసబుగా పనిచేసిన మార్పుల హనుమంతరెడ్డి (86) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మునసబుగా 40 ఏళ్లు పనిచేసి తర్వాత వీఆర్వోగా కొంతకాలం పనిచేశారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ వైద్యశాలలో హ నుమంతరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ముగిసిన అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం 12వ వార్షికోత్సవం రెండు రోజులుగా నిర్వహిస్తున్న పూజలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయాన్నే ఉత్సవమూర్తికి అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పడిపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచగవ్యపూజ, విశేష అష్టోత్తరశత నామ పూజలు నిర్వహించారు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తాడేపల్లి మండల పరిధిలోని కృష్ణనగర్, ప్రకాష్‌నగర్, ప్రజాశక్తి, కేవీఆర్ ప్రైమ్ అపార్ట్‌మెంట్, డోలాస్‌నగర్ ఏరియాలకు, ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు తాడేపల్లి మండల పరిధిలోని అరవింద స్కూల్ రోడ్, డీ మార్ట్ ఏరియా, ఏఆర్ పంపింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి



దాడిలో తీవ్రగాయాలైన వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శివ



గాయాలను చూపుతున్న షేక్ మొహిద్దీన్

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తాడికొండ: గంజాయి మత్తులో ఉన్న యువకులు వైఎస్సార్ సీపీ నాయకులపై విచక్షణారహితంగా దాడిచేసిన ఘటన గురువారం రాత్రి తాడికొండలో జరిగింది. వివరాల ప్రకారం తాడికొండ గ్రామ పంచాయతీ సమీపంలోని రచ్చబండపై కూర్చొని మాట్లాడుకుంటున్న మాజీ ఉప సర్పంచ్, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, పార్టీ నాయకుడు ఆకుల శివలను గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తమ అనుచరులతో కలసి విచక్షణారహితంగా రాళ్లు, కర్రలతో కొట్టారు. దాడిలో మొహిద్దీన్‌కు చేతికి బలమైన గాయం, ఆకుల శివకు కన్ను, ముఖం భాగంలో గాయాలయ్యాయి. తాడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులు గంజాయి మత్తులోనే తనపై దాడిచేశారని, వీరిలో ఒకడైన నిందితుడు ఫణి గతంలో గంజాయి కేసులో ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా తాడికొండలో యువతకు గంజాయి సరఫరా విచ్చలవిడిగా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాడేపల్లి, విజయవాడ ప్రాంతాల నుంచి యథేచ్ఛగా కొంతమంది సరఫరా చేస్తుండటంతో ఇటీవల కాలంలో యువత గంజాయికి బానిసలుగా మారుతున్నారని పలువురు ఆరోపిస్తున్న నేపథ్యంలో అయినా గంజాయి నిర్మూలనకు పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీపీ, షుగర్ వ్యాధులపై అవగాహన

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో గల యాపిల్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో శుక్రవారం బీపీ, షుగర్‌లపై డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కమలా కేర్ క్లినిక్ డాక్టర్ జి లక్ష్మీసుసీరాణి పాల్గొన్నారు. బీపీ, షుగరు వ్యాధులు, నివారణ మార్గాలు, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యాపిల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు యం అజయ్‌కుమార్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ బృందం విద్యార్థులకు విలువైన సలహాలు సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

65 మందికి వైద్య పరీక్షలు

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడిలో శ్రీ వర్ధిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమరావతికి చెందిన శ్రీ లక్ష్మీ హాస్పటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు ఎన్ శ్రీధర్‌చంద్ ఆధ్వర్యంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రోశిరెడ్డి, ట్రస్టు అధ్యక్షుడు సునీల్ రావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో 20 శాతం కేటాయించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారిపై రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతులకు రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. నీటి పారుదల, వ్యవసాయ రంగాలకు 13 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై. రాధాకృష్ణ, ఎం.హరిబాబు, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు కాజా వెంకటేశ్వరరావు, మొసలి జ్యోతిబసు, రాజబాబు, పంచకర్ల రంగారావు, ఎం. రామాంజనేయులు, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పార్వతి, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.